నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 22 నవంబర్ 2024 | NIZAMABAD

పీసీసీ సొంత ఇలాకాలో..

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సొంత ఇలాకా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీ గాడి తప్పింది. ఎవరికి వారే పంతం నెగ్గించుకునేందుకు పావులు కదుపుతుండడంలో పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొన్నది. నిజామాబాద్ జిల్లాలో మొన్నటి వరకు సీనియర్ లీడర్లంతా పదవుల విషయంలో నారాజ్ అయ్యారు. జూనియర్ లీడర్లకు కీలకమైన పదవులు కట్టబెట్టి తమకు పదవులే ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడుగు గంగాధర్‌ను రైతు కమిషన్‌లో సభ్యుడిగా నియమించిన సమయంలోనూ హస్తంలో అలజడి చోటు చేసుకున్నది. ప్రాధాన్యత లేని పోస్టు అప్పగించడంపై ఆయన తీవ్ర వేదనకు గురయ్యారు. పదవి వరించినప్పటికీ సంబురాలకు దూరంగా ఉంటూ బాధ్యతలు చేపట్టేందుకు వెనుకడుగు వేశారు. అధిష్టానం ఆదేశాలతో తిరిగి అదే పదవిలో కొనసాగేందుకు మొగ్గు చూపుతున్నారు. గ్రంథాలయ సంస్థ పదవులు, మార్కెట్ కమిటీ పాలకవర్గాల్లో చోటు కోసం శ్రమించిన నాయకులు సైతం ఇదే స్థాయిలో పార్టీకి అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. కీలక నేతలు వచ్చినప్పుడు ఇలా కనిపించి అలా మాయమవుతున్నారు. అధికారంలో లేనప్పుడు అన్నీ తామై వ్యవహరించి, సొంత డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ గుర్తింపు లేదంటూ కొందరు సీనియర్లు అనుచరులతో వాపోతున్నారు. పదవుల భర్తీలో సామాజిక న్యాయం లేకపోవడంతోనూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు సైతం అసంతృప్తితో రగిలి పోతున్నారు.

నిత్యం కొట్లాటలే..

జుక్కల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావుకు వ్యతిరేకంగా గాంధీభవన్‌లో పాత కాంగ్రెస్ నాయకులంతా కలిసి ధర్నా చేయడం కలకలం రేపుతున్నది. మార్కెట్ కమిటీ పదవికి ఇంటర్వ్యూలు పెట్టినట్లు ప్రచారం చేసుకుని సీఎంతో మెప్పు పొందిన గంటల్లోనే ఆయనకు వ్యతిరేకంగా ఆందోళనలు జరగడం చర్చకు దారి తీసింది. మరోవైపు, అటు బాన్సువాడలో పోచారం శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం రోజుకో రీతిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ప్రతిగా పోచారం వర్గం సైతం తమదైన శైలిలో తిప్పి కొడుతుండడంతో రాజకీయం రసవత్తరంగా మారుతున్నది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, సుభాష్‌రెడ్డి మధ్య పోరు తారాస్థాయికి చేరింది. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సుభాష్‌రెడ్డి వర్గం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిత్యం ఎక్కడో ఒకచోట పొట్లాటలకు దిగుతున్నది. సీఎం వర్గం మనిషిగా సుభాష్‌రెడ్డి తనదైన శైలిలో దూసుకు పోతుండగా, సిట్టింగ్ ఎమ్మెల్యేగా మదన్‌మోహన్ తన పంతం నెగ్గించుకునేందుకు పావులు కదుపుతుండడం.. కాంగ్రెస్‌లో కుమ్ములాటలకు దారి తీస్తున్నది. బాల్కొండలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన సునీల్‌రెడ్డికి పోటీగా మానాల మోహన్‌రెడ్డి తెర మీదికి వస్తున్నారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధపడి అనూహ్యంగా వెనక్కి తగ్గిన ఆయన.. కార్పొరేషన్ చైర్మన్ హోదాలో శ్రేణులను తనవైపునకు తిప్పుకుంటున్నారు. ఆర్మూర్‌లో పాత కాంగ్రెస్ నాయకులంతా పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పాత నాయకులను వినయ్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజామాబాద్ అర్బన్‌లో షబ్బీర్ వర్సెస్ పీసీసీ చీఫ్ వర్గం మధ్య పోటాపోటీ నడుస్తున్నది.

కాంతారావు హఠావో..

కాంగ్రెస్ బచావో

- జుక్కల్ ఎమ్మెల్యేపై సొంత పార్టీ నేతల అసమ్మతి
- గాంధీభవన్ ఎదుట బైఠాయింపు

బిచ్కుంద, నవంబర్ 21: కాంతారావు హఠావో.. కాంగ్రెస్ బచావో అంటూ జుక్కల్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎనిమిది మండలాలకు చెందిన నేతలు, కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుపై అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడిన వారిని పట్టించుకోకుండా వలస వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలను విస్మరిస్తూ కాంగ్రెస్‌ను బలహీనపరుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 ఏండ్లుగా కాంగ్రెస్ కోసం కష్టపడిన వారిని కాదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు అంటగడుతున్నారని విమర్శించారు. లక్ష్మీకాంతారావు మారకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని పీసీసీ పెద్దలకు కాంగ్రెస్ నేతలు సౌదాగర్ అరవింద్, జయ ప్రదీప్, కమల్ కిశోర్, వినోద్, సంగమేశ్వర్ తదితరులు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌లోని గాంధీభవన్ మీడియా పాయింట్ వద్ద తమ గోడును వెల్లబోసుకుంటున్న జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు



గాంధీభవన్ ఎదుట బైఠాయించిన జుక్కల్ కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్‌లో కుమ్ములాటలు

- పెరుగుతున్న అసంతృప్తి రాగాలు
- నియోజకవర్గాల్లో రోడ్డెక్కుతున్న పార్టీ శ్రేణులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు
- గాంధీభవన్‌కు చేరుతున్న ఆధిపత్య పోరు

నిజామాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'హస్త' రేఖలు చెదిరి పోతున్నాయి. అధికార పార్టీలో అసంతృప్త రాగాలు జోరందుకున్నాయి. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. సొంత పార్టీలోనే ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటూ రోడ్డెక్కుతున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ తరహా కార్యక్రమాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. పదవుల కోసం కొందరు, అసంతృప్తితో మరికొందరు, నాన్ లోకల్ ప్రజా ప్రతినిధుల తీరును నిరసిస్తూ పాత లీడర్లు ఇలా ఎవరికి వారు నిరసన బాట పడుతున్నారు. గురువారం ఒకే రోజు జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో విభిన్నమైన రీతిలో నిరసన కార్యక్రమాలు జరగడం దుమారం రేపుతున్నది. గాంధీభవన్ వేదికగా ఎమ్మెల్యేకో హఠావో.. జుక్కల్ బచావో అంటూ కాంగ్రెస్ లీడర్లంతా మూకుమ్మడిగా ధర్నా చేశారు. ఇక, పార్టీ జెండా మోస్తున్న వారిని కాదని, ఇటీవల కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన వారికి మార్కెట్ కమిటీ పదవి కట్టబెట్టడంపై బీర్కూర్‌లో కాంగ్రెస్ శ్రేణులు రోడ్డెక్కాయి. ఎల్లారెడ్డిలోనూ మొన్నటికి మొన్న ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సుభాష్‌రెడ్డి వర్గం ఎదురు తిరిగింది. నియోజకవర్గాల్లో నువ్వా నేనా అన్నట్లుగా పొట్లాటలకు సై అనడంతో రాజకీయం రసవత్తరంగా మారుతున్నది. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సొంత ఇలాకాలోనే ఆధిపత్య పోరు జరుగుతుండడం అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లోనూ చర్చనీయాంశమైంది.

రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు

వలస నేతలకు పదవులు ఇవ్వడంపై ఆగ్రహం

నస్రుల్లాబాద్, నవంబర్ 21 : దశాబ్దాలుగా జెండా మోసిన వారిని కాదని వలస వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడంపై కాంగ్రెస్ నేతలు రోడ్డెక్కారు. పార్టీ నాయకత్వ తీరును నిరసిస్తూ కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో గురువారం ధర్నాకు దిగారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలో సీనియర్ కార్యకర్తలు ఉన్నా.. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన దుర్గం శ్యామలకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్న వారిని కాదని ఇటీవల కాంగ్రెస్‌లోకి వచ్చిన పోచారం శ్రీనివాసరెడ్డి అనుచరులకు పదవులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తమ ఆవేదనను పార్టీ పెద్దలు గుర్తించక పోతే హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను తొలగించి.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, జహీరాబద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ప్రతిపాదించిన ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు బసవరాజ్, దివిటి శ్రీనివాస్, అబ్దుల్ అహ్మద్, పోగు నారాయణ, కమలాకర్‌రెడ్డి, అరిగె సాయిలు, లక్ష్మణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్‌పీజీ డైరెక్టర్ జనరల్, పరేడ్ నిర్వహిస్తున్న శిక్షణ పూర్తిచేసుకున్న ఏఆర్ కానిస్టేబుళ్లు

నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలి

- ఎస్‌పీజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనిల్‌కుమార్ సూచన
- 250 మంది ఏఆర్ కానిస్టేబుళ్లకు ముగిసిన శిక్షణ

బోధన్, నవంబర్ 21 : శిక్షణ పూర్తిచేసుకున్న ఏఆర్ కానిస్టేబుళ్లు నిజాయితీ, అంకితభావంతో పనిచేసి తెలంగాణ పోలీసు వ్యవస్థకు మరింత గుర్తింపు తీసుకురావాలని రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ శివారులో ఉన్న నిజామాబాద్ కమిషనరేట్ పోలీస్ శిక్షణ కేంద్రంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 250 మంది ఏఆర్ కానిస్టేబుళ్లకు 9 నెలలుగా కొనసాగుతున్న శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా 'దీక్షాంత్ పరేడ్' (అవుట్ పాసింగ్ పరేడ్) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌పీజీ డైరెక్టర్ జనరల్ అనిల్‌కుమార్ హాజరై, శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసులు విధి నిర్వహణతోపాటు వ్యక్తిగత జీవితంలో కూడా ఆదర్శప్రాయంగా ఉండాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పాటించాలని అన్నారు. రాష్ట్రంలోని 16 పోలీస్ ట్రైనింగ్ సెంటర్లలో 8,149 మంది శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు ఉద్యోగాల్లో చేరనున్నారని వెల్లడించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి సీపీ, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ, పోలీసు అధికారులతో కలిసి కానిస్టేబుళ్ల పరేడ్‌ను వీక్షించారు. పరేడ్ అనంతరం కానిస్టేబుళ్లతో ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ కోటేశ్వర్‌రావు ప్రతిజ్ఞ చేయించారు.

పెద్దసంఖ్యలో తరలివచ్చిన కుటుంబీకులు, ఉద్విగ్న వాతావరణం

శిక్షణ పూర్తిచేసుకున్న పరేడ్‌ను వీక్షించేందుకు ట్రైనీ కానిస్టేబుళ్ల తల్లిదండ్రులు, కుటుంబీకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కోలాహలంగా మారింది. కార్యక్రమం పూర్తయిన అనంతరం కానిస్టేబుళ్లు వారి కుటుంబసభ్యులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఉద్యోగాల్లో చేరనున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, భార్యాపిల్లలతో పోలీసు టోపీలను ధరింపజేసి ఆనందక్షణాలు పంచుకున్నారు. తోటి కానిస్టేబుళ్లు, కుటుంబీకులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. రంగారెడ్డి జిల్లా తాళ్లకొండపల్లి మండలం చెన్నంపల్లికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు పబ్బతి రాఘవేందర్, పబ్బతి శివకుమార్ పరేడ్‌ను చూసేందుకు వారి తల్లిదండ్రులు మణెమ్మ-ఆంజనేయులు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ సొంతూరు నుంచి ఇక్కడికి వచ్చారు. తమ ఇద్దరు కుమారులు ఒకేసారి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడంతో సంబురపడ్డారు. ఆ అన్నాదమ్ములిద్దరూ తమ టోపీలను తల్లిదండ్రులకు పెట్టి, పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

హామీలు నెరవేర్చకుంటే

నిరవధిక సమ్మె

- 15 రోజుల్లో చర్చలకు ఆహ్వానించాలి..
- ప్రభుత్వానికి సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హెచ్చరిక
- కలెక్టరేట్ ఏవో, డీఈవోకు నోటీసు అందజేత

డీఈవోకు నోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

కంఠేశ్వర్, నవంబర్ 21: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెచేపడుతామని హెచ్చరించారు. ఈ మేరకు వారు కలెక్టరేట్ ఏఈ, డీఈవోకు గురువారం సమ్మె నోటీసును అందజేశారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, రానున్న 15 రోజుల్లో చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలు నిరవధిక సమ్మెకు దిగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రాజు, గౌరవ అధ్యక్షుడు ఆష్రఫ్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, ప్రధాన కార్యదర్శి కె.భూపేందర్, జిల్లా కోశాధికారి ప్రసాద్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజు, సీఆర్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పవిత్రన్, పీటీఐల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, డీపీవో స్టాఫ్ పాల్గొన్నారు.

బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

- ఎలాంటి షరతులు లేకుండా పెన్షన్లు పెంచి ఇవ్వాలి
- బీడీ కార్మికుల ధర్నా
- సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి

బాన్సువాడ, నవంబర్ 21 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, ప్రభుత్వం మొద్దునిద్ర వీడి జీవనభృతి మొత్తాన్ని రూ.4016కు పెంచి ఇవ్వాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని బీడీ కార్మికులు గురువారం ముట్టడించారు. కటాఫ్ తేదీని తొలగించడంతోపాటు బీడీ కార్మికులందరికీ షరతులు లేకుండా పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను మాత్రం అమలుచేయడం లేదని మండిపడ్డారు. మహిళల ఓట్లతో గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి బీడీ కార్మికుల గురించి అసెంబ్లీలో మాట్లాడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బీడీలు చేసే వారందరికీ రూ.4016 చొప్పున పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, శ్రామికశక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల, విభిన్న వ్యక్తుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడాపోటీలు గురువారం నిర్వహించారు. పోటీలను అదనపు కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు.

– కంఠేశ్వర్, నవంబర్ 21

అసలేం జరుగుతోంది?

- 'ఖజానాలో దొంగలు' పై కలెక్టర్ ఆరా
- ట్రెజరీ శాఖ తీరుపై అసహనం
- పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశం
- 'నమస్తే తెలంగాణ' కథనంపై తీవ్ర చర్చ

నిజామాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి జిల్లా ట్రెజరీ శాఖలో అవినీతి తారాస్థాయికి చేరింది. ఆఫీస్‌కు వచ్చే వారి నుంచి కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ అక్రమాల తంతుపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనం అధికారుల్లో గుబులు రేపుతున్నది. కొత్తగా నియామకమైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎంప్లాయి ఐడీ జారీకి డబ్బులు దండుకున్న తీరుపై ఈ నెల 21న జిల్లా సంచికలో ప్రచురితమైన 'ట్రెజరీలో దొంగలు' కథనంపై కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆరా తీశారు. ట్రెజరీలో అసలేం జరుగుతున్నదో పూర్తి నివేదికను అందించాలని జిల్లా ట్రెజరీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా డీటీవోగా బాధ్యతలు చేపట్టిన అధికారికి సంబంధం లేకపోయినప్పటికీ కొంతమంది సిబ్బంది తీరుతో శాఖ పరువు పోతున్నది. వీరి వ్యవహారంతో ప్రతి శాఖ నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు ఉండడంతో రోజంతా ట్రెజరీ శాఖ వ్యవహారంపైనే మాట్లాడుకోవడం గమనార్హం. డీటీవోలోనే ఉంటూ ఓ సంఘంలో కీలక భూమిక పోషించే ట్రెజరీ అధికారి తీరును చాలా మంది తప్పుబట్టారు. డీటీవోలో ప్రక్షాళన జరిగితే తప్ప, ఇక్కడ మార్పును ఊహించలేమని ప్రతిఒక్కరూ వ్యాఖ్యానించారు. ట్రెజరీతో సంబంధం ఉన్న ప్రతి శాఖలో అటెండర్ నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ బాధితులేనని కలెక్టరేట్‌లో జోరుగా చర్చ నడుస్తున్నది.

అమలుకాని ఆరు గ్యారెంటీలు..

నిరూపిస్తే రాజీనామా చేస్తారా?

జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి, నవంబర్ 21: ఆరు గ్యారెంటీలు అమలుకావడంలేదని ప్రజలు అంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వారి పదవులకు రాజీనామా చేస్తారా అని జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలు కావడంలేదన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ కాలేదని, రైతు భరోసా ఊసే లేదన్నారు. అన్ని రకాల పంటలకు రూ.500 బోనస్ కూడా లేదని మండిపడ్డారు. రైతన్నలకు బీమా ఉన్నదా లేదా అనే విషయంపై అయోమయ పరిస్థితి నెలకొన్నదన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా, రైతు కూలీలకు రూ. 12 వేలు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు.. నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా మారాయన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి ఛాలెంజ్ విసిరే స్థాయి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి లేదన్నారు. సమావేశంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, పార్టీ సీనియర్ నాయకులు సత్యప్రకాశ్, తెలంగాణ శంకర్, శేఖర్ రాజు, ఫహీం ఖురేషీ, నర్సా గౌడ్, విజయ్‌కుమార్, సాదిక్, కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు.